# మహమ్మద్ నిసార్

## ముల్కి

ఆ యల్ల పెద్ద షెర్‌గతి. మొహర్రం తొమ్మిదో రోజు. అల్వాల రాశిబోసినట్లు నిప్పులు మండుతుంటె కనకన-కనకన డప్పులు మోగుతుంటె- ఆ మంటల్ల మంటై- డప్పుల్ల డప్పై- అడుగుల్ల అడుగై తెల్లార్లూ ఆడాలె, పాడాలె అనిపిస్తది. చూసేటోల్లకు గూడ ఎంతో సంబూరమనిపిస్తది. గంటలు గంటలు రెప్పగొట్టకుండ నిల్సొని సూత్తుంటరు - మురుస్తుంటరు.

కాట్లు కాట్లుగ తోలు తీసి కాల్చిన శిత్పాల కర్రల్ని ఒక చేతుల- తువ్వాలను ఇంకో చేతుల పట్టుకొని డప్పుల దరువుకు జోడుగ చిందేస్తూ కర్రల్ని- తువ్వాలని కిందికి మీదికి ఊపుకుంట- ‘తల్లల్లో! ఆయిలో!’- ‘దుంబొలికే! ఆయాసో!’ ‘దూలో! ఏక్‌మారీ!’ అనుకుంట గుంపులు గుంపులుగ ముసలోల్లు- వైసోల్లు- పోరగాల్లు పాడుకుంట అల్వా సుట్టు దుంకులాడుతుంటె నా సామిరంగ ఆ మజా కలిసి ఆడితే గని కండ్లార సూత్తెగని బుద్ధి తీరది.

మబ్బుల్నే మల్ల సవార్లను లేపాలె గనుక డప్పులు ఆపంగనె జనం ఎక్కడోల్లక్కడ ఎల్లిపోయిండ్రు. నేను గూడ సోపతిగాల్లతో ఊరోల్లతోని గలిసి దూల ఆడిఆడి పాడిపాడి పూర్తిగ తకాయించిన. మా ఇంటికొచ్చి అకిట్ల మంచమేసుకొని పండుకున్న. ఆకాశం తేటగ కడిగినట్టుంది. అల్వాకాడ ఆట సూత్తున్నట్టు- పాటలింటున్నట్టు సుక్కలన్ని హుషారుగ కనిపిత్తున్నయ్.

అంతల ఇంటిముంగల కిరకిర చెప్పుల సప్పుడు- ఎవలో వస్తున్నట్టుంది. ‘ఏమోయ్ పిల్లగా! అప్పుడే పన్నారోయ్?’ అనుకుంట అండెం ముత్తిరెడ్డి పిలిసిండు.

‘రా! బావా రా!’ అనుకుంట లేసి కూసున్న.

‘అటు పల్లెపాటు సప్పుడినిపిస్తనే వుంది- ఇటు బావండ్లపెల్లి డప్పులు మోగుతనే వున్నయ్. మీరు జల్దే సాల్ జేసిండ్రు’ అనుకుంట నా పక్కనొచ్చి కూసుండు.

‘మాదేముంది బావా? డప్పులోల్ల జోరు. ఆడేటోల్ల హుషారు. ఆడేటోల్లను వొద్దంటమా?’ అని నేనన్న.

‘మీ అన్నదమ్ముల జూసి మాదిగోల్లు ముడ్డికి కట్టుకుంటుండ్రు. మమ్మదబ్బాసు మామున్నప్పుడే మాదిగోల్లు చేతులుండేది. చెప్పినట్టు ఇనేది’ అనుకుంట చుట్ట ముట్టిచ్చుకున్నడు.

‘మా తాతల జమానల మర్రి బాయికాడ నిలబడి కూతేస్తె గజ్జున వనుక్కుంట గిదగిద వురుకొచ్చెటోల్లని మా అమ్మ జెప్పేది. రోజులెప్పుడు వొక్క తీరుగుంటాయి. ఆళ్ళూ తెలివికొస్తుండ్రు’ అని నేనన్న.

‘పండుగ సంబూరాన్ని మర్సిపోవుడు ఏం తెలివోయ్. షెర్‌గతినాడు మీ నాయిన మసీదుల కూసొని వూదు మంత్రిచ్చి బొట్టు బెట్టి ఈపుల సరుపు సరిస్తె మనుషులకే గాదువాయి ఊరికే పట్టిన దయ్యం వదిలనట్టయ్యేది. పెద్ద షెర్‌గతినాడు అల్వాకాడికి ఎన్ని తీర్ల ఏషాలొచ్చేది. గుడ్డేలు



Scanned with CamScanner

గేషం, ఫక్కీరేషం, బద్దుల కొంరని గొంగ్లేషం, ఎరుకలి సానేషం, జాంగిర్ పీర్లేషాలు, లంబడేషాలు, పోరగాండ్లంత ఏషాలేసుకుని పాడుకుంట- ఆడుకుంట దునుకులాడుతుంటే బలె గమ్మతగనిపిచ్చేది' ముత్తిరెడ్డిబావ శిన్న పొల్లగానోల్లె చెప్పుకపోతుండు. 'నా శిన్నతనాన సూసిన- మమ్మదబ్బాసుమామ గూడ గొల్లేషం ఏసి నూకలు నోట్లె బోసుకొని నములుకుంట తుప్పు-తుప్పు ఊంచుకుంట బొయ్యేది. బలె గమ్మతు గమ్మతు జేసేది. ఇంటున్నవా? పంటున్నవోయ్ పిల్లగా' అంటూ బుజం మీద చెయ్యేసిండు.

'ఇంటున్న ఇంటున్న. పొద్దుగాల్ల మల్ల జల్ది లేవాల్నాయె. మనం లేపితే గాని మాదిగోల్లు లేసి రారు' అన్న.

'అవును వాయి! ఇంక పండుకో. రేపు పొద్దుగాల పిల్లగాల్లకు ఇన్ని జామకాయలు పట్టుకొస్త' అనుకుంట ఎల్లిపాయిండు.

☆☆☆

'మునీరు! ఓ మునీరు' అని కూతలు పెట్టుకుంట తలుపు కొడుతుండు మబ్బు అబ్బసాయిలు.

నేను లేద్దామనుకునెసరికి మా మునీర్‌భాయి లేషి తలుపు తీసిండు. అబ్బసాయిలు లోపలికొచ్చిండు. 'ఏంది మామ ఇంత రాతిరొచ్చినవ్. ఇప్పుడు టైమెంతయితుందే' అన్నడు మా భాయ్.

'తెల్లారొస్తుందయ్యా! అగ్గో, సుక్క బొడిసి అంతెత్తు ఎక్కింది. జప్పున తయారు గా, పోదాం' అన్నడు అబ్బసాయిలు.

'యాడికి మామ' అన్నడు మా భాయి.

'మంచి చెలపెయ్యను తెచ్చిన్నయ్య. హలాల్ జెయ్యాలె. జల్ది నడువు. ఆ పని జూస్కొని వొస్తస్త డప్పులోల్లను పిలుచుకొద్దువు గని' అని అబ్బసాయిలు మామ మా భాయిని తోల్కపాయిండు.

పండుగలకు, పెండ్లీకు ఎవరు యాటలు కోసుకున్నా మా అబ్బజాన్ చేతనే హలాల్ చేయించుడు, సుట్టాలొస్తె కోడిని కోసుకున్నా మా ఇంటికి తెచ్చి హలాల్ చేయించుకపోవుడు, మాదిగిండ్లల్ల గొడ్లు కోసుకున్నా మా నాయిననే తీస్కపోయి హలాల్ చేయించుడు మా ఊరి రివాజు. హలాలు చేసినందుకు గుండెకాయ, కొంచెం కార్జం, ఐదు మాంసపు తిక్కలు చాటుగ తెచ్చి ఇచ్చి పోతరు. మా అబ్బజాన్ చేసే పనే ఇప్పుడు మా భాయి చేస్తందుకు పాయింది.

మునీర్ భాయ్ పాయ్న పది నిమిషాల్ల పని ముగించుకొని తిరిగొచ్చిండు. మసీదు దగ్గర డప్పుల చప్పుడైతంది. తెల్లారకముందే సవార్లు బాయిల పడుతయి. పీర్లను తీస్కొని ఊరి చివరికెల్లాలె. నేను మసీదు కాడికిపోయె తలెకు సవార్లు లేసి ఆడుతున్నయి. ఎంతమంది కొత్తోల్లు శిగాలూగుతున్నరో చూస్తున్న. కొందరాడోల్లు పిల్లలు కావాలని తానాలు జేసి తడిబట్టలతోనే పీర్లముందు పబ్బతి బట్టి వరాలు కోరుకుంటుండ్రు. పోయినేడు మొక్కినోల్లు కొత్త దట్టీలు, కొబ్బరి కాయలు, పూలదండలతో మొక్కులు చెల్లించు కుంటుండ్రు. కొందరు శిగాలూగుతు పీర్లనెత్తుకుని అల్వ నిప్పుల్ల దునుకుతుండ్రు. నేను వూద్దాను పట్టుకుని అడిగిన వాల్లందరికీ వూదు బొట్టు పెడుతున్న. ఇంతల మా భాయి పీర్లు బాయిలపడే టైమయిందని హడావుడి చేయంగ పీర్లు అల్వ నిడిసి వూర్లెకు మర్లినయ్. సాకలోల్ల ఇండ్ల కాంచి కాసం భూమయ్య ఇంటికాడ మలుపు తిరిగి దేవుని గుడి పక్కెంబడి సక్కగ కాశరామస్వామి, సుద్దాల హన్మంతు ఇల్లు దాటి గడ్డమీది నర్సయ్య ఇంటి ముంగల ఆగినయ్. పీర్ల ముఖాలు పడమటికి తిప్పిండ్రు. మా భాయ్ మా అబ్బజానోల్లె అరబ్బి మంత్రం చదివిండు. వూదు కాల్చిండు. ఆడికి తీసుకొచ్చిన షర్బత్ తలా ఇంత పోసిండు. అన్నుంచి దొర బురుజు పంటి దొరగడి దాటి గొండ్లోల్ల వాడకట్టుకెల్లి మల్ల మసీదు పోవాలె. పోత పోత కర్బలా మైదానంల



Scanned with CamScanner

నెత్తురు మడుగుల నిలబడి కొట్లాడి చనిపోయిన వీరులను తలుచుకోవాలె. అందుకని-

'రారో కహెతీతి ఖాసీంకి దులహన్! చుడియాఁ మైఁ బదానె న దూంగీ! ఏక్ దో దిన్‌కి హూఁ మై సవాగిన్ చూడియాఁ మైఁ బదానె నాదూంగీ!' అని పాడుకుంట పోతున్నం.

చప్పుడుకు కాశరామస్వామి బయటికొచ్చి 'ఏం బిడ్డా! ఎప్పుడొచ్చింండ్రా?' అని మందలిచ్చిండు.

'మేం మొన్నొచ్చినమే. మీరు బాగున్నారే? నేను మల్లొచ్చి కలుస్త' అనుకుంట నేను పీర్లెంట మసీదుకొచ్చిన.

సవార్లు బ్రాహ్మణపెల్లి తిరిగి రావాలె. సవార్లెంట మా భాయ్ పాయిండు. నేను ఆల్వా కూడిపేసిన. మల్ల కాశ రామస్వామి ఇంటికి పోయిన.

నులక మంచంల కూసొని చాయ్ తాగుతున్నడు. నన్ను చూడంగనె 'ఏమే? కొడుకొచ్చిండు, చాయ్ తీస్కరా' అంటు కూతేసిండు.

రామక్క పెద్దమ్మ చాయ్ గ్లాసుతోని వొచ్చింది. 'ఏం నాయిన ఎప్పుడొస్తిరి?' అన్నది.

'మొన్నొచ్చినం పెద్దమ్మ' అన్న.

'ముగ్గు రొచ్చింండ్రా?' అనడిగింది.

'నడిపన్న వంట్లె బాగలేదు. పెద్దన్న నేనే వచ్చినం' అని నేనన్న.

'మా కోడండ్లు, మనుమలు, మనుమరాండ్లంత వచ్చింండ్రా?' అని అడిగింది.

'ఆఁ.... అంతా వచ్చింండ్రు' అన్న.

రామక్క పెద్దమ్మది మా అమ్మది మంచి సెనితం. మా అమ్మ బతికున్నప్పుడు ఇద్దరు గంటల కొద్ది ఎంతో పావురంగా మాట్లాడుకోంటోల్లు. రామక్క పెద్దమ్మను చూస్తున్నా, మాట్లాడుతున్నా మా అమ్మె యాదికొస్తది.

'మీరు కొలువులు జేసుకుంట పట్నంల వున్నరు. మీ నాయిన పోయిన తెల్లారె ఉన్న ఇల్లు అమ్ముకొని వూరికి రాకుంటయితరనుకున్న గని- మమ్మదబ్బాసు లెక్కనే పండుగ జేసి నాయిన పేరు నిలబెడుతుండ్రు బిడ్డా' అన్నడు రామస్వామి పెద్దనాయిన.

'ఎంతైన పుట్టి పెరిగిన ఊరుగదనే. మేమున్నంత కాలం గిట్లనే వత్తనే వుంటం. పండుగ జెత్తనే ఉంటం' అని నేనన్న.

'సరిగ్గా యాభై ఆరేండ్ల కింద మనవూరి తురకలంత చెట్టుకోడు, పుట్టకోడై దేశాల్‌పట్టి పోతె మమ్మదబ్బాసొక్కడే సస్తే వూర్లెనే జస్త బతికితె వూర్లెనె బతుకుత అని వూరు జొచ్చి వొచ్చిండు' ఎనకటి రోజులు యాది చేసుకుంటున్నడు రామస్వామి.

'అప్పటి రోజులల్ల తురుకోల్లంత రజాకార్లతోని కలిసి పోయింండ్రానే?' అని నే నడిగిన.

'రజాకార్లతోని అంత కలువలేదు గని - వూర్లె మీ నాలుగో తాత ఇమాం సాబు కారణంగ దొరలకు తురుకోల్లకు పడకుంటయింది' అన్నడు.

'దొరలు తురుకోల్లు మిలాఖతై ఊర్లన్ని దోసుకున్న రంటరు గదనె? మరి మన వూల్లె దొరలకు తురుకోల్లకు కొట్లాటెందు కొచ్చిందే?' అని మల్లడిగిన.

'అదంత నిజంగాదు. ఆ రోజల్ల దొరల ఇంటికి సుట్టపొడొచ్చిన, ఎవరన్న అధికారి వచ్చిన కోల్లున్నోల్లు కోడిని, గొర్లున్నోల్లు గొర్రైని, గౌండ్లోల్లు కల్లుకుండలు, కోమటోల్లు కిరాణం సామాను పుణ్యానికే ఇయ్యాలె. మీ ఇమాంసాబ్ తాతకి కిరాణం దుకానముండె. ఒకనాడు దొరల మనిషి వెంకటాద్రి సామానియ్యమని ఇంటికొస్తే మీ తాత ఇయ్యనండు. అట్ల ఆనికి మీ తాతకు తకరారొచ్చి, మాట మాట పెరిగి, ఇమాంసాబ్ ఎంకటాద్రిని కొట్టి పంపిండు. ఇగ ఎట్లయిన దొరలొచ్చి తనమీద హమ్లా జేస్తరని ఇమాంసాబ్ హైదరాబాదు కురికిండు. ఆడ నిజాం మిల్ట్రిల వున్న మన వూరి

జాఫర్‌ను కలిసిండు. సుద్దాల్ల వున్న ఖబరస్తాన్ జాగను దొరలు ఖబ్జా జేసిండ్రని జాఫర్ సాయంతోని 'వఖ్ఫ్' బోర్డుల కేసేసిండు. జాఫర్ తన పరపతితోని, కేసు నిజానిజాలు తెలుసుకునేతందుకని రజాకార్ల నాయకుడైన ఖాసీం రజ్వీని తీస్కొని సుద్దాల కొచ్చిండు. ఖాసీం రజ్వీ సుద్దాలకొచ్చి పోయిండని కమ్యూనిస్టుల చెవుల బడ్డది. కమ్యూనిస్టులకు తెలిస్తే మమ్ముల వదిలిపెట్టరన్న బయంతో తురుకోల్లంత ఊరొదిలి ఎల్లిపోయిండ్రు' అని జరిగిన కథనంత పూసగుచ్చినట్టు చెప్పుకొస్తున్నడు రామస్వామి పెదనాయిన.

'మరి మా నాయిన గూడ అల్లతోనె కలిసిపోయిండా' అని నేనడిగిన.

'అల్లతోని కలువలే. ఆ రోజుల్ల మీ నాయిన అబ్కారి జవానుగ కొలువు జేసెటోడు. ఊరి కొట్లాటలకు అనికి ఏ సంబందము లేదు' అన్నడు పెద్ద మనిషి.

'మా అమ్మ చెప్పంగ ఓ సంగతి నాకు బాగా గుర్తుందే' అని నేనన్న.

'ఏం చెప్పేది' అని అడిగిండు.

'ఒక రాత్రి కాడ లేసి అంతా పట్నం బోదామని ఆలేరు చేరుకుండ్రంట. ఆడికి పోంగనె సంఘుపోల్లు వొచ్చి రొచ్చిరని పుకార్ లేసిందట. భయానికి అందరు పెంటకుప్పల చెట్లుంటె ఆ చెట్లల్ల సప్పుడు గాకుంట నతికిండ్రట. మా సాయబ్బమ్మ దాది గుడ్డు పెట్టె కోడిని సంకల పెట్టుకొని కూసుందట. ఎవడో ఎనకంగొచ్చి రప్పున కోడిని గుంజుకొని ఒకటే ఉరుకుడు ఉరికిండట. 'అయ్యో నా కోడి! కోడి!' అని ముసలామె మొత్తుకుంటుంటె లొల్లి పెట్టకని ఆమె నోరు మూసిండ్రట. గట్ల ఎంతోసేపు దాస్కొని రైలు రాంగనె ఎక్కిపొయిండ్రట. హైదరాబాదు పోయి ఆడ మా నాయిన లేడని నల్లగొండల వున్నడని అక్కడి పత్తా పట్టుకొని, ఇద్దరు ఆడిబిడ్డల్ని సంకల సంటి పిల్లనేసుకొని మా అమ్మ నాయినను చేరబోయిన రోజుల్ల పడ్డ కష్టాలు ఎన్నోసార్లు చెప్పేదే!' అని మా అమ్మ చెప్పిన సంగతులు చెప్పిన.

వెంటనె రామక్క పెద్దమ్మ అందుకొని 'అక్కడేమన్న సుఖపడ్డరా బిడ్డా! సరుకారు జీతాలియ్యక ఉప్పిడుపాసం సచ్చిండ్రు' అన్నది.

'అప్పుడు పడ్డ బాధలు ఎంత జెప్పిన తక్కువే నాయిన' పెద్దాయన చెప్పుకపోతున్నడు.

'నైజాం పోలీసులు హడ్తాల్ జేసిండ్రు. మూడు నెల్లు జీతా లియ్యలే. అబ్కారిగూడ బందయింది. అబ్కారు జవాన్లను సర్కార్ ఆదుకోలేకపోయింది. అబ్కారి జవాన్లంత 'అరూర్' లున్నప్పుడు కమ్యూనిస్టుల దాడినుండి తప్పించుకున్నరు. ఆడికెల్లి నార్కట్‌పెల్లి శివారులున్న కొట్టంలకు అడ్డ మార్చుకున్నరు. ఏ క్షణంలనైనా సంఘుపోల్లు మల్ల దాడి చేస్తరేమోనని రాత్రింబగల్లు హుషారు గుండెటోల్లు. ఇటు శత్రుభయం - అటు భార్యా బిడ్డా-చెల్లెల్ల దిక్కులేని బతుకులు. అది బర్దాష్ కాక మమ్మదబ్బాసు ఇంటికొచ్చిండు. వొచ్చె తలెకు మీ అమ్మ, ఇద్దరు మేనత్తలు మూడు రోజుల్నుండి ఉపాసమే ఉన్నరట. మీ నాయిన ఇంట్లకు రాంగనే ముగ్గురు ఒక్కసారె మీదపడి గొల్లున ఏడ్సిన్రట. ఈడుంటె మనం సచ్చినా ఎత్కపొయ్యే దిక్కులేదు. ఆ సావేదో మన వూర్లెనె సద్దాం అని బిందె బగోన్లు గిరిపెట్టి- కొలువుకు సలాం గొట్టి మమ్మదబ్బాస్ ఎల్లొచ్చిండు' అని చెప్పుకొస్తుంటె రామస్వామి పెదనాయిన మొకం వాస్తవాలు కనిపించె అద్దమోలె మెరుస్తున్నది.

'ఆడికెల్లి సుద్దాలకు రాలేదట - సుద్దాల పొంటి సంఘుపోల్లు తిరుగున్నరని సక్కగ మా అమ్మమ్మ వూరు సిరిపురం చేరిన్రట' అని మా నాయిన చెప్పిన ముచ్చట యాదికొచ్చి నేను జెప్పిన.

'ఊరికి ఎవరన్న కొత్తోల్లొచ్చిండ్రంటె సంఘుపోల్లకు తెలిసి పొయ్యేది' అన్నడు పెద్దమనిషి.

'ఔనటనే! మా నాయిన సిరిపురం జేరేతలెకు శీకటి పడ్డదట. తిందామని అందరు కూసున్నరట. అంతల్నే-సంఘుపోల్లొచ్చిండ్రు. పిలుస్తుండ్రు అని మనుషులొచ్చిండ్రట. అంతే! కలిపిన ముద్ద



Scanned with CamScanner

కలిపినట్టె వదిలేసి మా నాయిన లేసి నిలుచుండట.

'అయ్యో! నాలుగు రోజులకెల్లి పచ్చి మంచినీల్లకైనా నోచుకోలె - జర నాలుగు బుక్కలు తిననియ్యండ్రయ్య' అని మా తాత బాషుమియ బతిమిలాడిండట.

'ఓ బాషయ్య! గవన్ని మా గాదు గాడ సంఘపోల్లొచ్చిండ్రు. ఏదున్నంటె గాడ జెప్పుకో! నడువయ్య నడు' అని వచ్చినోల్లు మా నాయనను చెరో రెట్ట పట్టుకొని తోల్కపోయిన్రట.

శిమ్మశీకట్ల వూరు బైటున్న ఓ బాయికాడ మామిడి చెట్టుకింద కె.ఆర్. దళంతో వున్నడట. దళాన్ని చూసి నా నాయిన సెల్యూట్ చేసిండట.

'ఎవరు నువ్వు?' ఉరిమినట్టె అడిగిండట.

'నా పేరు మహ్మద్ అబ్బాస్' అన్నడట మా నాయిన.

'ఎక్కడినుండొచ్చినవ్? ఏం పని జేస్తవ్? ఈ వూరెందుకొచ్చినవ్?' తూటాలు పేల్చినట్టె కంచుకంఠం మోగిందట. కూసున్న నాయకుడు లేచి నిలుచున్నడట. దళం మా నాయనను రజాకారు అనుకున్నరట.

'మా వతన్ సుద్దాల. నేను అబ్కారి జవానుగా నార్కట్‌పెల్లి క్యాంపులున్న. మాకు మూడు నెల్లకెయి జీతాలిత్తలేరు. పెండ్లం, పిల్లలు ఉపాసం చస్తుంటె, ఆ సావొద్దు, ఆ కొలువొద్దు అని నౌకరొదిలి మా వూరు పోతున్న' అని జంకకుండ జవాబిచ్చిండట మా నాయిన.

'నువ్వు రజాకారు కావని, అబ్కారి జవానువని- మాకేం రుజువు?' మల్ల గదమాయించి అడిగిండట నాయకుడు.

'నా బందూకు నల్లగొండ హెడ్‌కోటర్ల పడేసిన. యూనిఫారం ఇంట్ల వుంది. నా దగ్గరున్న ఆధారం నా బెల్టు, నా నెంబర్ బిల్ల' అని తీసి సూపెట్టిండట మా నాయిన.

'మరి ఈ వూరికెందుకొచ్చినవ్. ఎంటనే మీ వూరికెల్లిపో! ఈ వూల్లె మల్ల కనపడొద్దు' అని బెదిరిచ్చి వొదిలి పెట్టిండ్రట.

ఆడికెల్లి ఇంటికి రాంగనె 'పెద్దపులి నోట్లకెల్లి బయటపడ్డవ్. ఎవలెవలో వస్తరు మల్ల బిలిపిస్తరు. పదిరోజుల కింద పోచన్నపేటల నలుపైమంది రజాకార్లను పట్టుకొని మొద్దుమీద వొరుసగ పండబెట్టి సంఘపోల్లు నరికేసిండ్రు. నిన్ననే రాజపేటల నలుగురి తలలు నరికిండ్రు. రోజులు బాగలెవ్. అంత్రైతె పొల్లగాల్లు ఈన్నె వుండనియ్. నువ్ మాత్రం ఫౌరన్ ఈడికెల్లి ఎల్లిపో. నిన్నిక్కడ బతకనియ్యరు' అని మా తాత పట్టుబట్టిండట.

'నేనేమన్నా రజాకార్లతో కలిస్తినా? యాన్నన్న దోసుకొస్తినా? ఎవరి పుస్తెలన్నా తెంపుకొస్తినా? పొట్టతిప్పలకు అబ్కారీల నౌకరి జేసిన. ఏ తప్పు జెయ్యలె. నాకేం భయం. ఎక్కడ బొయిన గిదే ఆలతు. నేను సుద్దాలకే పోత. చావో బతుకో నా వతన్‌లనే తేల్చుకుంట' అని మా నాయిన బయటికొచ్చిండట.

'గదె బిడ్డా! గాయల్ల పొద్దు పొడిసె తలెకు మీ నాయిన ఊల్లెకొచ్చిండు. సూడు సూడుమని ఆయల్ల నేనూర్లె లేను. అమ్మటాల్లదాక వూరంత కలెదిరిగి అందరిని కలిసిండు. దొరల మనిషైన ఎర్ర రాజిగా డొక్కడే- మమ్మ దబ్బాసును జూసి, తుపుక్కున ఊంచి, 'నాల్రోజులు వూరు నిమ్మలంగుండె, మల్లేదో ముసలం బుడితట్టుంది' అని అన్నడంట. 'గీని మాటలకేంది. చెట్టుమీది కాకసుంటోడు. గిందేం లెక్క' అనుకొని ఊల్లెకొచ్చెసరికి గొండ్లోల్లు, కురుమోల్లు, సాకలోల్లు, మంగలోల్లు, 'ఎప్పుడొచ్చినవ్ బిడ్డా? బాగున్నవా?' 'అలీమ బాగుందా అయ్యా?' 'పిల్లలు నిమ్మలంగుండ్రా తమ్మి? 'ఏం బావా అంతా మంచేనా? ఎన్ని రోజులకు కండ్లబడితివి మాఁవా!' 'మల్ల వూల్లెకు రావనుకున్నం పిల్లగా' అట్ల వూరంతా వరుసలతో పేరుపేరున మందలిస్తుంటే



Scanned with CamScanner

కడుపునిండి నట్టయిందట. చిన్నతనంల్నే అమ్మను పోగొట్టుకున్న అబ్బాసుకు సుద్దాల వూరు అమ్మవాడి అయింది.'

రామస్వామి పెదనాయిన కండ్ల ముంగల కనబడుతున్నట్టె కథ చెప్పుకొస్తుండు. గూడ పుల్లయ్య ఇంటికి పోయె తలికి తాళ్లల్లకెల్లి వొచ్చి ముస్తాదు ఇడుస్తుండట. 'ఏం బిడ్డ! ఎప్పుడొచ్చినవ్? కోడలూ-పొల్లగాల్లు ఎక్కడున్నరు?' అని సంగతులన్ని తెలుసుకొని 'పుట్టి పెరిగిన వూరుండంగ గూడులేని పచ్చేలె తిరుగుడెందుకయ్యా? వొచ్చినోని వొచ్చినవ్ - మల్లెటు పోవద్దు. వూర్లె తురకోల్లు లేకుంటాయె. నీ ఇంట్ల నువ్వుండు - ఎవ్వడేమంటడో నేను జూసుకుంట' అని ధైర్నం జెప్పిండట.

ఎప్పుడైతె గూడ పుల్లయ్య మమ్మదబ్బాసును ఊల్లెనే వుండాలని ధైర్నం జెప్పిండో - ఇక వానికి ఏనుగంత బలమొచ్చినట్టైంది. ఆడికెల్లి బైటికెల్లంగనే మిరాల కర్రెయ్య ఎదురై 'ఎప్పుడొత్తివి బావా?' అని బిర్రుగ కావలిచ్చుకుండట. ఆ మాట ఈ మాట మాట్లాడుకుంట ఇంటికి తోల్కపోయిండట. కాళ్లకు నీల్లిచ్చి కడుక్కోమండట. పీటేసి కూసోబెట్టి, 'అవ్వా బువ్వ పెట్టె' అని అనంగనె 'అయ్యో! పావుసేరన్నె వుంటె నీ మందం అయితదని వొండిన బిడ్డా' అని అల్లవ్వ అన్నదట. అయితెమాయెగని ఎంతుంటెగంత గీ ఆకుల పెట్టవ్వ' అని ఇస్తరాకు ముంగల పెట్టుకుండట. దుర్గమ్మ వున్న బువ్వంత ఇస్తరాకుల పెట్టంగనె అదే చేయితోని అండ్ల నడిమికి రెండు బాగాలు చెయ్యమన్నడట. చేసినంక సగం అబ్బాసుకిచ్చి సగం కర్రెయ్య తిన్నడట. అప్పట్ల కర్రెయ్య మీ నాయిన గట్ల సొంత బావా బామ్మర్దుల కన్నెక్కువ కలిసుండేటోల్లు. మంచి పాన సెనితం వాళ్లది' అని యాభై మూడేండ్ల కింద జరిగిన కతంత మూడురోజుల కింది ముచ్చటలెక్క చెప్పుకొచ్చిండు పెద్దమనిషి.

'నీ లెక్క ఇనెటోల్లుంటె, తిండనడు, తిప్పలనడు, చెప్తుతనె వుంటడు మీ పెదనాయిన' అన్నది రామక్క పెద్దమ్మ.

'నీ తిండి సల్లగుండ. నీకెప్పుడు తిండి లోకమే! సైసరాదె' అన్నడు రామస్వామి పెద్దయ్య.

'ఏం సైసుడో ఏమో! నిన్నియ్యాల పురాగ శాత గాకుండయింది. యాల్లకింత తిని గా గోలెసుకుంటె జర పానం నిమ్మలం గుండదా! నువు గూడ లేరాదు బిడ్డ! తలో బుక్క తిని పురుసతుగ కూసుందురు గని' అంది పెద్దమ్మ.

'లేదు పెద్దమ్మ! నేను ఎల్డాకనే నాష్ట జేసొచ్చిన. తింటే పెదనాయిన తినని' పెద్దమనిషి కెయి జూసుకుంట 'తిను పోరాదే' అని అన్న.

'ఇప్పుడే చాయ్ తాగితిమి. ఇప్పుడే ఏం తింటం బిడ్డా?' అండు పెద్దమనిషి.

'ఈనెప్పుడు గిట్లనే అయ్యా! అప్పుడు ఆ జమానల రాత్రనక పగలనక, ఆకలనక, దూపనక, రాయిరప్పా శీకటి శీదు, పురుగు బూశనక, భోనగిరి దాక నడుసుకుంటనే పొయ్యేది నాయినా' అని ఎనకటి కాలాన్ని యాది చేసుకుంది పెద్దమ్మ.

'భోనగిరి దాకేంది బిడ్డ! భూముల కేసులు దీసుకొని నల్లగొండకు గూడ నడుసుకుంటనే పొయ్యేది. అప్పుడు గీ బస్సులెక్కడియ్' అన్నడు పెద్దయ్య.

'సంపాయించాలనుకుంటె మస్తు సంపాయించు గని నియ్యతు భారబు జెయ్యలె మీ పెద్దయ్య' అంది రామక్క పెద్దమ్మ.

ఇప్పుడు చెరువు పట్టెల్ల వున్న మాన్యం భూములన్ని నేను తప్పు జేసి పంచినయే. కాయకష్టం జేసుకుంట జనం కోసం పని జేసిన గని వూరుమీద పడి ఎప్పుడు తిరుగలె' అని పెద్దమనిషి చెప్తుతుంటే ఇప్పటి అవార నాయకుల చెంపమీద చెళ్ళున చరిసినట్టనిపించింది.

'అప్పుడు నువు దళంల వున్నావె?' అని అడిగిన.

నేను దళాలతో తిరుగలే గని- మన ఏరియాకు ఐదు దళాలొచ్చేది. ఆరుట్ల రాంచెంద్రారెడ్డి



Scanned with CamScanner

దళం, దూదిపాల సత్తిరెడ్డి దళం, గురజాల నారాయణరెడ్డి దళం, కెఆర్ దళం, కృష్ణమూర్తి దళం. మీ నాయిన వూర్లె కొచ్చిన రోజె గురజాల నారాయణరెడ్డి దళం యామగాని లచ్చయ్య బాయికాడ్కి వొచ్చింది.

ఏ దళం వొచ్చిన అల్లకు సమాచారాలు చెప్పి అన్నాలు చాయెలు నేనే సప్లయి జేసేటోన్ని. ఆయల్ల నారాయణరెడ్డుండి, 'ఏం రామస్వామి! ఊర్లెకు రజాకారొచ్చిండటగా? వాన్ని పట్కరా పొండ్రి' అన్నడు. అప్పటిదాక అందరికి మీ నాయిన చేతులతోనె చాయ లిప్పిచ్చిన. 'ఎక్కడి రజాకారండి! మనోడే మమ్మదబ్బాసు. ఇగో వీడే' అని అబ్బాసును సూపెట్టుకుంట- ఏదో నాల్రోజులు అబ్కారి జవానుగ బతకబోయిండుగని వానికి వశపడలే- కొలువొదిలి తిరిగొచ్చిండు. వీడు సాధు జంతువే గాని ఇస్సపురుగు గాదు' అన్న.

'నువ్వొక్కని వంటెట్ల? ఊరంత ఏమనుకుంటుండ్రు' అన్నడు మల్ల నారాయణరెడ్డి.

'వూరంత అబ్బాసుండాలనే కోరుకుంటుంది. ఎవరు ఎతిరేకం లేరు. ఇతని విషయంల పూర్తి జిమ్మెదారి నాది' అన్న.

'సరే నీ మాట మీద వదిలేస్తున్న. మల్లొచ్చెసరికి ఏదో ఒకటి తేల్చి చెప్పుండ్రి' అనుకుంట దళం ఎల్లిపోయింది.

నేను, గడ్డమీది రాజయ్య, వట్టిపెల్లి కర్రెయ్య, యామగాని లచ్చయ్య, గూడ పుల్లయ్య ఈ ఐదుగురి 'పంచ్ కమిటీ' మాటమీద వూరు కట్టుబడి వుండేది. అండెం ఎర్రారెడ్డి మాకు సప్పోటు గుండెటోడు. గూడ జెగ్గయ్య, ఎర్ర రాజయ్య దొరలకు అనుకూలం గుండెటోల్లు.

తెల్లారి పంచాయితీల అందరం కూసున్నం. ఊరంత కదిలొచ్చింది. మందిల మమ్మదబ్బాసును నిలబెట్టినం.

'మన వూరి తురుకోల్లంత చెల్లాచెదురైపోయిరి. పొట్ట తిప్పలకు ఎక్కడెక్కడో తిరిగి మమ్మదబ్బాసు మల్ల ఊరుజొచ్చి వొచ్చిండు. వచ్చినోన్ని ఉండనిద్దామా? ఎల్లగొడదామా?' అని నేననంగనే ఎర్ర రాజయ్య లేసి 'ఎంతయిన తురుక పిల్లను నమ్మొద్దు' అన్నడు.

'ఏందేంది? మమ్మదబ్బాసు ఎవర్ని దోసిండని ఎవర్ని సంపిండని? ఆయనే పాప మెరుగడు' అని మందిలకెల్లి ఎవరో అన్నరు.

'తురుకోడు లేకుంటే వూరికి బరుకతుండదు. మమ్మదబ్బాసు ఊరిడిసి పోవద్దు' అని ఇంకోలన్నరు.

'ఔనవును, ఎప్పుడన్న కందూరు జేసు కుందామంటె హలాలు జేసే దిక్కు లేదు. బిస్మిల్లా అని వూదు గాల్చేటోడు లేకుంటయిండు. అబ్బాసు ఈన్నె వుండాలె' అని ఒకరన్నరు.

అంతల్నే ఎర్ర రాజిగాడుండి 'ఎంతయిన యాపచెట్టుకు పాలు పోస్తే తియ్యగయితాది' అన్నడు.

'తురుకోడు లేకుంటెవూరంత దోడుదోడుగుంది. ఒక్కడన్న వుండాలని వూరంత అంటుంటె- నువ్వేమో యాపచెట్టు- గీపచెట్టని లావులావు మాట్లాడుతున్నవ్. నీ సాగొచ్చిన మాటలారా?' అని గూడ పుల్లయ్య కర్రందుకొని లేసి నిలబడ్డడు. దెబ్బకే ఎర్ర రాజిగాడు లేసి మెల్లగ జారుకుండు. ఆ రోజుల్ల గూడ పుల్లయ్య కర్రందుకొని లేసిండంటె ఎసుంటి పంచాయితయిన తెగిపొయ్యేది' అనుకుంట రామస్వామి పెదనాయిన నవ్విండు.

'నా చిన్నతనానోసారి ఓట్లొచ్చినయ్. నేనూకుండక - 'అబ్బుజాన్! అబ్బుజాన్! నీ ఓటు ఎవరికేస్తవ్' అని అడిగిన్నే. అప్పుడు మా నాయిన 'నేను ఆనాటినుండి కమ్యూనిష్టు పార్టీకే ఓటేస్త' అని బదులిచ్చిండు. 'మన పాలోల్లంత చెల్లా చెదురయినా మనం మన వూర్లే క్షేమంగా వున్నమంటె ఆనాడు కమ్యూనిష్టోల్లు పెట్టిన బిక్షనే బేటా ఇది' అన్నడే' అని నేనన్న.





Scanned with CamScanner

'ఆ.. ఆ రోజుల్ల తురుకోల్లు ఒంటరిగ తిరుగాలన్న ఒక వూరినుంచి ఇంకోవూరికి పోవాలన్న సావు ఎంబడేసుక తిరిగినట్టె. అందుకని రెండు నెల్లు అబ్బాసును నేనెంటేసుకొని తిరిగిన. వాడు దొడ్డికి పొయిన నేనెంటుండేది. నన్నొదిలి ఎక్కడికి పోక పొయ్యేది. నాతోనె తినేది. నాతోనె పండేది. ఊరికి వచ్చిపొయ్యే సంఘ దళాలందరికి పరిచయమైనంక ఇగ ఢోకా లేదని భరోసా కలిగినంక మీ అమ్మను తీసుకొచ్చుకోని ఎప్పటిలెక్క వుండుడు షురూ జేసిండు' అని అప్పటి దాక మంచం మీద కూసున్నోడల్ల లేచి నిలబడ్డడు రామసామి పెద్దనాయిన.

ఇంతల రామక్క పెద్దమ్మ అందుకుంది. 'మీ నాయినేం తక్కువ కతల బడ్డడా నాయిన! రాత్రిపూట బడిపెట్టి ఊళ్లె శాన మందికి సదువు నేర్పిండు. బాగోతం నేర్పిండు. నేర్పిండు. ఏశాలు గట్టిండు, బక్తప్రాల్లాద, సత్యఅరిశెంద్ర, బాలనాగమ్మ ఇప్పుడాదికి లెవ్వుగాని ఎన్నెన్నో ఏశాలేసేది. మీ నాయిన ఏ ఏశం గట్టిన మంచిగ కుదిరేది. ఆయనేశం వత్తెనే ఆటగమ్మేది' అని తను బాగోతాలు చూసి మురిసిపోయిన రోజులు నెమరేసుకొంది పెద్దమ్మ.

'తూరుపు దిక్కునుండి డప్పుల చప్పుడినిపిస్తుంది. బ్రామ్మణపెల్లికి పోయిన సవార్లు తిరిగి వస్తున్నట్లున్నయ్. డప్పులోల్లు సవార్లు ఎత్తుకుపోయినోల్లు ఆకలితో నుంటరు. ఆల్లకు బవ్వల ఏర్పాట్లు జెయ్యాలె. 'పెదనాయిన! ఇగ మీరు గూడ తినుండ్రి. నేనొస్త' అనుకుంట ఇంటికొచ్చిన.

డప్పులోల్లు, సవార్లు ఎత్తుకున్నోల్లు అంతా తింటున్నరు. మా భాబి వొడ్డిస్తుంది. తినుకుంటనే మబ్బు అబ్బసాయిలు మామ 'మా ఆలీమక్క వొండినట్టే బగార బువ్వ బలె కమ్మగుంది' అన్నడు.

'మీ చిన్నయ్య నెలదప్పిన మనిషి లెక్క రుచుల గోర్తడు. ఇంకో నాలుగు బుక్కలెక్కువ బెట్టమ్మ' పరాష్కంగన్నడు బద్దుల బిచ్చపతి.

'తురుకోల్లొండింది ఏదైనా కమ్మగుంటది. తొక్కు నూరి పోపు బెట్టిన సుట్టు నాలుగిండ్లకు గుమగుమ ఆసనొత్తది. జర్రంత పారు బొయ్యి కోడలా' అన్నడు విఠలప్పయ్య.

'ఒరెక్క! ఎక్కువ తింటె ఏర్గ బెట్టగాలె. తక్కువ తినోయ్. మాపటికి సవారెత్తుకొని వూరంత తిరుగాల్నాయె' అన్నడు చెయ్యి కడుక్కుంట బత్తిని రాజాలు మామ.

అందరు తిన్నంక 'మీరు కల్లుబొట్టు తాగి జల్దొస్తె సవార్లు జల్ది లేపొచ్చు. వూరు తిరుగుడు గూడ జల్దయిపోతది. ఇగోండ్రె కల్లు పైసలు' అంటు మా మునీర్ భాయి డప్పులోల్లకు పైసలిచ్చి పంపిండు.

★★★

అనుకున్న టైంకు అందరొచ్చిండ్రు. సవార్లు లేపినం. నేను మా భాయ్ చెరో వూద్దాను తీస్కొన్నం. నిప్పుకంక లేసుకున్నం. అంతా కలిసి ఇల్లిల్లు తరుగాలంటె ఆల్సెం అయితదని మేమిద్దరం చెరిసగం వూరు తిరుగాలనుకున్నం. దొర సవారెత్తుకొని జనగ లెల్లయ్య, మీరు గాని రామనర్సు, ముగ్గురు డప్పులోల్లు, మా భాయ్ ఓ దిక్కు, కాసిందూల నెత్తుకోని విఠలయ్య, సైదబ్బాస్ నెత్తుకోని బత్తిని రాజాలు, ముగ్గురు డప్పులోల్లు, నేను ఓ దిక్కు అనుకొని వూరు తిరుగుడు మొదలు పెట్టినం.

నేను యామగానోల్ల ఇండ్లు దిరిగి కాసం భూమయ్య కొడిశాల చెంద్రయ్య ఇండ్ల కాడికి పోయె తలెకు అంతా దోడుదోడు గనిపిచ్చింది. నా చిన్నతనాన కోమటోల్ల అరుగులకాడ చిలుకల పేర్లు, కుడుకలు కొనేటోల్లు. గుంపులు, గుంపులు గుండెటోల్లు. చిన్నపిల్లల మెడలనిండా చిలుకల పేర్ల దండలు కనిపిచ్చేవి. పడుసు పోరగాండ్లు పడుసు పిల్లలకు వరుసలు కలిసినోళ్లు పరాష్కలాడుకుంట పోటీలు పడి కుడుకలు ఇప్పిచ్చేది. వూర్లెవున్న పడుసోల్లంత కోమటోల్లింటికాడ జాతర లెక్కుండేది. ఇప్పుడా దుకానాల్లేవు. ఆ జనాల్లేరు. ఆ జోరు లేదు. ఆ మజా లేదు. మాదిగోల్లు ఎప్పటి లెక్కనే వూర్లెకొచ్చి వూదు-బెల్లం సదివిస్తుండ్రు. సవార్లు ఇల్లిల్లు తిరిగినా మాదిగిండ్లకు పోవు. అసలు



Scanned with CamScanner

మాదిగోల్లు డప్పు కొట్టకుంటె పీర్ల పండుగె లేదు. కాదు. అల్వ ఆడాలన్న, సిగం రావాలన్న, సవ్వారి లేవాలన్న, ఊరు తిరుగాలన్న, అంతా డప్పులతోనెనాయె. మరి ఆ డప్పులోల్ల ఇంటి ముందల్కి సవార్లు పోయె రివాజు మా వూర్లె ఎందుకు లేదో నాకు సమజు గాదు.

ఇంటికి సుట్టమొస్తె కాళ్లకు నీళ్లిచ్చినట్టు సవారి ఇంటిముందుకు రాంగనె బిందెడు నీళ్లు కాళ్లమీద బోస్తరు. వాళ్లు తెచ్చిన వూదు, వూద్బత్తి కాల్చి అరబ్బి మంత్రం చదువుతం. బొటిమెన ఏలు, నడిమేలు వూదుకాల్చిన నిప్పుల్ల అద్ది ఇంటోల్లందరికి కనుబొమ్మల చివర్న అడ్డంగ బొట్టు బెడతం. కుడుక, కట్నం డబ్బులు సవారికి కడుతరు. వాల్లెచ్చిన బెల్లం బుడ్డ పోరగాండ్లకు పంచి పెడుతుంటె దూలా! దూలా! అనుకుంటు సవార్లెంట తిరుగుతుంటరు. అట్ల వూరంత తిరిగేసరికి రాత్రి రెండయింది.

అటుకెల్లి మా భాయ్ - ఇటుకెల్లి నేను మసీదు చేరుకున్నం. మాదిగోల్లు డప్పులుకాపుతుంటె సప్పుడుకు సుట్టుపక్కలోల్లు లేసి మసీదుకాడి కొచ్చింద్రు నాలుగుసుట్లు అల్వసుట్టుతిరిగి పీర్లను మసీదులపండబెట్టి ఒక్కదగ్గరికి కట్టి దుప్పటి కప్పినం. ఇంటికాన్నుంచి సొంగరొట్టెలు, పెరుగన్నం సద్దిమూటను తీస్కోని మా అన్న కొడుకు అన్వర్, నా కొడుకు ఇమ్రాన్ వచ్చింద్రు.

సవార్లు ఎత్తుకున్నోల్లు ఎంట తిరిగిన పోరగాల్లు డప్పులోల్లు సుట్టుపక్కలోల్లు అంత మసీదు నిండా కూసున్నరు. నేను సొంగ రొట్టెలల్ల పెరుగన్నం పెట్టిస్తుంటె అన్వర్-ఇమ్రాన్‌లు అందరికి ఇస్తున్నరు. అంతల్నే ఓ పొల్లగాన్కి సరాన బడ్డట్టయింది. రాజమల్లక్క గబుక్కున ఉరికి నీళ్లబిందె తెచ్చి పెట్టింది. తినుకుంట తలా ఓ మాటంటుండ్రు.

'ఎక్కువోల్లు, తక్కువోల్లు, అంటూముట్టనకుండ, అన్ని కులాలోల్లు సంబూరంగ జేసుకునేది గీ వొక్క పీర్లపండుగనే' అన్నడు మాదిగ పెద్దయ్య.

'నా కొడుకు పోయిండు మల్ల పీర్ల పండుగ కాస్తననుకోలే మనువడా' అంది పూసలి మల్లమ్మ.

'అట్లెట్లనుకున్నవ్. మా బావ పేరు నిలబెడుతుండ్రు మా అల్లుండ్లు' అన్నడు బత్తిని లచ్చయ్య మామ.

'మమ్మదబ్బాసన్న వున్నంత కాలం మాకు మా పోరగాండ్లకు దవాఖానంటేందో తెల్వదు. అన్న మంత్రిచ్చి బొట్టు పెట్టిండంటె ఎంత రోగమైన దెబ్బకే దెంక పొయ్యేది' అన్నది బుర్ర రాజమల్లక్క.

'ఒక్క ఈ వూరేంది, సుక్కురారం వొచ్చిందంటె సుట్టు పది వూర్ల నుంచి సంకల పిల్లల్నేసుకొని జనం వురుకొద్దురు. అబ్బాసు తాత చేతుల ఏముండెనో పసిపిల్లలకు దేవునసుంటోడు' అన్నడు గడ్డమీది సోమయ్య.

'ఎంత చేతుల పెడితె గంతె తీసుకునేది. గని గింత ఇయ్యమని ఎన్నడు అడుగకపొయ్యేది' అన్నది మంగలి లచ్చమ్మ.

'మమ్మదబ్బాసు వూరికొక్కడున్న మాకు ఇంటికొక్కడున్నట్టు ధైర్నముండే. కష్టమో, సుఖమో మాతో కలిసి అనుభయించిండు. ఓ మునీరు! మీ మాగిముంత ఈడుంది. ఇది మీ వతన్! మీకేమన్న గావాలంటె మాతోని కొట్లాడి తీస్కొనె అక్కు మీకుంది' అన్నడు దంతూరి బాలనర్సు తాత.

'పుట్టిపెరిగిన పల్లెటూరు కన్నతల్లితో సమానం. మేమున్నంత కాలం గిట్లనే వస్తుంటం. పోతుంటం' అని మా భాయ్ అంటుంటె ఎక్కన్నో కొక్కొరోకో అని కోడి కూసిన సప్పుడయింది.

'అగ్గొ తెల్లారొత్తుంది. మీరు గామాట మీదుంటె మాకు గదెసాలు. మీరు ముగ్గురన్నదమ్ములు పిల్లజెల్లలతోని వొచ్చిపోతె మాకు గదె పండుగ' అనుకుంట ఎక్కడోల్లక్కడ ఎల్లిపొయింద్రు.



Scanned with CamScanner